అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రణాళిక

దశలవారీగా రోడ్లు నిర్మించాలని నిర్ణయం

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు జరిపిన వార్డు పర్యటనల్లో ఎకడెక్కడ అంతర్గత రహదారులు నిర్మించాలనే అంశంపై దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు అప్రోచ్‌రోడ్ల అభివృద్ధికి పూనుకున్నారు. గత పాలకవర్గాలు అంతర్గత రోడ్లు నిర్మాణం విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపాయి. ప్రధాన రహదారులు తప్పిస్తే, కాలనీల్లో అప్రోచ్ రోడ్లను నిర్మించడం లేదు. ఫలితంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఖరుకు భారీగా నిధులు వచ్చిపడ్డ 2014 పుష్కరాల సమయంలో కూడా వార్డుల్లో ప్రజలు మొరపెట్టుకున్నా గత పాలకవర్గం పట్టించుకోలేదు. అప్రోచ్‌రోడ్లు వేయడానికి ప్రయత్నమే చేయలేదు.

ఎన్నో ఇబ్బందులు...

పట్టణంలో చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కానీలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించారు. కానీ కాలనీ నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకోవడానికి అప్రోచ్ రోడ్లు లేవు. దీంతో మట్టిదిబ్బలను దాటుకుంటూనే వెళ్లాల్సిన పరస్థితి. ఎన్టీఆర్ కాలనీ, నందమూరు కాలనీ, వైఎస్సార్ నగర్, స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, పొన్నపల్లి ప్రాంతాల్లో ఇదే తరహా ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. దళితులు, పేదలు ఎక్కువగా ఉండే 27, 28 వార్డుల్లోనూ, మున్సిపాలిటీ మురికివాడలుగా గుర్తించిన అరుంధతిపేట, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి. వీటన్నంటినీ దశలవారీగా నిర్మించాలని నిర్ణయించి మున్సిపాలిటీ ముందుకు వెళ్తుంది. ఇప్పటికే వార్డుల్లో గుర్తించిన ప్రాతాల్లో అప్రోచ్‌రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

నరసాపురం మున్సిపాలిటీలో రోడ్లు ఇలా

రోడ్డు రకం	కిలోమీటర్లు
సీసీ రోడు	31.52 కిలోమీటర్లు
బీటీ రోడ్లు	15.65 కిలోమీటర్లు
కంకర రోడ్లు	7 కిలోమీటర్లు
కచ్చా రోడ్లు	2 కిలోమీటర్లు



31వ వార్డు చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కాలనీలో సగం పూర్తి చేసి వదిలేసి అప్రోచ్ రోడ్డు

అప్రోచ్ రోడ్లన్నీ పూర్తి చేస్తాం



వార్డుల్లో చాలాప్రాంతా ల్లో అప్రోచ్‌రోడ్లు లేక పోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్లు పూర్తిస్థాయిలో అయితే 5 కిలో మీటర్లు వరకూ ఉంటాయని గుర్తించాం. దశలవారీగా అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించాం. అవసరమైతే జనరల్‌ఫండ్స్ ఖర్చు చేసి నిర్మిస్తాం. ఇప్పటికే కొన్ని వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టాం

– బర్రి శ్రీవెంకటరమణ మునిసిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

సీఎం సహాయనిధి పేదలకు వరం



శాన్విక కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎల్‌ఓసీను అందజేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్రప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన కోపల్లి శాన్విక అనే రెండేళ్ల చిన్నారికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.10లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం వారి కుటుంబికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వైద్యానికి పెద్ద పీట వేసిందన్నారు. సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, చల్లా సత్యనారాయణ, కోళ్ల శ్రీను పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ సక్రమమే



చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: స్కిల్ స్కామ్‌లో మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ సక్రమమేనని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడు జీవితమే పెద్ద స్కామ్ అని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఐడీ అధికారులు సాక్ష్యాధారాలు దగ్గర పెట్టుకుని చంద్రబాబుని అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగులను, విద్యార్థులను చంద్రబాబు స్కిల్ డవలప్‌మెంట్ పేరుతో మోసం చేశారని మండిపడ్డారు.

తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలి

పాలకొల్లు అర్బన్: తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు కోరారు. శనివారం పాలకొల్లులో విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో జీవిస్తున్న తూర్పుకాపులకు మాత్రమే ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. దక్షిణాంధ్ర జిల్లాలకు వలస వచ్చిన తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించడం లేదని వివరించారు. దీనిపై తూర్పు కాపు సంఘీయులు అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశబూరు. తూర్పుకాపుల వెనుకబాటుతనాన్ని తెలియజేయాలని కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాన్ని కోరిందన్నారు. ఈ నెల 13న రాష్ట్ర అధికార ప్రతినిధులను నివేదించాలని ఉత్తర్వులివ్వడంపై సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో సంఘ నాయకులు సీహెచ్ సత్యనారాయణ, లోపింటి చిరంజీవి, కరుమజ్జి సత్యనారాయణ, కంది రామచంద్రరావు, వాకాడ అప్పారావు, పిల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



దొడ్డిపట్లలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

యలమంచిలి: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి ఇంటింటికీ వెళ్లి ప్రతి నెలా 1న మీ వలంటీర్ పింఛన్ డబ్బులు సక్రమంగా ఇస్తుందా అంటూ అవ్వా, తాతలను చేయూత సొమ్ములు సక్రమంగా అందుతున్నాయా? పావలా వడ్డీ సొమ్ములు మీ ఖాతాలో జమయ్యాయా? అంటూ డ్వాక్రా మహిళలను, రైతు భరోసా సొమ్ములు సక్రమంగా వస్తున్నాయ?అంటూ రైతులను పలకరించారు. కుల, మత, పార్టీ, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని గడప గడపకూ వెళ్లిన సమయంలో లబ్ధిదారులు చెపుతుంటే ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని రాత్రి ఏడు గంటలకు ముగించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడు మేకా శేషుబాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓదూరి శ్రీనివాసరావు సర్పంచ్ చెల్లుబోయిన ప్రమీల కుమారి పోడూరు ఎంపీపీ సిబ్బితి సుమంగళి, పాలకొల్లు జెడ్పీటీసీ నడపన గోవిందరాజులునాయుడు, జిల్లా నాయకులు కొండేటి రవి, బోనం బులివెంన్న, ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, కానూరి కృష్ణారావు, శిరగం శ్రీనివాస్, కోళ్ల వెంకటేశ్వరరావు సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బాగోతం బట్టబయలు



కొడమంచిలిలో విలేకర్లతో మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు సీతారామ్

పెనుగొండ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతి బాగోతం బట్టబయలైందని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శనివారం కొడమంచిలిలో విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెట్ చేసిన స్కామ్ చేసి ఇంకా బుకాయిస్తున్నారన్నారు. తప్పులు చేసిన బాబును అరెస్ట్ చేయకపోతే వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఉండదన్నారు. రూ.371 కోట్లు మింగేసి ఆధారాలతో దొరికితే అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అనడానికి ఉదాహరణ చంద్రబాబు అరెస్టే అని అన్నారు. టీడీపీ పాలనలో ఎన్నో స్కామ్‌లు జరిగాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో సీమెన్స్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని, 90 శాతం పెట్టుబడి వస్తుందంటూ ప్రచారం చేసి పైసా ఇవ్వకుండానే అధికారులపై ఒత్తిడి తెచ్చి రూ.371 కోట్లు విడుదల చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండేటి రమేష్, ఆచంట మండల సచివాలయ కన్వీనరు టీఎస్‌డీ చంద్రశేఖర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాక సురేష్, పోలిశెట్టి వనమరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ



పాలకొల్లు అర్బన్: కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

నరసాపురం రూరల్: న్యాయాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృత ప్రచారం చేయించి శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 753 కేసులకు సంబంధించిన కక్షిదారులు రాజీ పడి తమ సమస్యలను పరిష్కరించుకున్నారు. ఈ కేసుల్లో రూ.53 లక్షల విలువైన సమస్యలు పరిష్కారమయ్యాయి. 717 క్రిమినల్ కేసులు కాగా, సివిల్ కేసులు 5, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు 31 పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు, 1వ అధనపు జూనియర్ సివిల్‌జడ్జి కె శ్రీనివాస్, న్యాయవాదులు, ఎస్ శ్రీధర్, సూర్యప్రకాషరావు, హనీష్‌వర్మ తదితరులు కేసుల రాజీలో కీలక పాత్ర పోషించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం పొందడమే కాకుండా కక్షిదారులకు అంగీకారమైన, అప్పీలు లేని తీర్పు పొందవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి అన్నారు. పాలకొల్లు కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి పలు కేసులను పరిష్కరించారు. పాలకొల్లు కోర్టు పరిధిలో 601 కేసులను రాజీ చేసి అవార్డులు జారీ చేశారు. ఈ కేసులు రాజీ ద్వారా రూ.45,25,998లను కక్షిదారులు పరిహారంగా పొందారు. ఏపీపీ జయసింధు, లోక్ అదాలత్ సభ్యులు జక్కంశెట్టి వెంకటేశ్వరావు, సైమన్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పరమేశ్వరుని విగ్రహావిష్కరణ

పెనుమంట్ర: ఆచంట రోడ్డులోని మార్టేరులో నూతనంగా రూ. 50 లక్షలతో నిర్మిస్తున్న శాంతిధామం(శ్మశానవాటిక) నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. దాతల సహకారంతో మార్టేరు అభివృద్ధి కమిటీ మూడు నెలల క్రితం ఈ శ్మశాన వాటిక నిర్మాణ పనులు ప్రారంభించారు. శనివారం శ్మశాన వాటిక గేటు వద్ద జ్ఞానముద్రలో ఉన్న పరమేశ్వరుని విగ్రహాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ విగ్రహంతో పాటు కాలభైరవుడు, సత్యహరిశ్చంద్ర, విగ్రహాలను కూడా ఏర్పాటు చేశారు. బంధువులు, ఆత్మీయులు వేచి ఉండటానికి భవనంతో పాటు గ్రామజనాభాకు అనుగుణంగా రెండు దహన వాటికలు ఇక్కడ నిర్మించిన వాటిని రంగులతో తీర్చిదిద్దారు. త్వరలో ఈ శ్మశాన వాటికను ప్రారంభిస్తామని సంఘ సభ్యులు వైఎస్సార్ సీపీ నాయకుడు వెలగల నారాయణరెడ్డి తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కొవ్వూరి బ్రహ్మేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చిర్ల సత్యనారాయణరెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, గుత్తుల బోసు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణ జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 8గంటలకు పట్టణ జేసీఎస్, సచివాలయ, గృహ సారథుల సమావేశం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ ఇన్‌చార్జ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం చినగోపురంలో ప్రత్యేక పూజల్లో గోపి పాల్గొంటారని వివరించారు. సాయంత్రం 5గంటలకు లయన్స్ కమ్యూనిటీ హాలులో తూర్పు కాపు సంఘీయుల ఆత్మీయ సమావేశంలో గోపి పాల్గొంటారని పేర్కొన్నారు.

కొమ్ముచిక్కాలలో హనుమాన్ చాలీసా పారాయణ

పోడూరు: కొమ్ముచిక్కాల గ్రామంలో సామూహిక శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక క్షత్రియ రామాలయం, భక్తబృందం, గ్రామస్తుల ఆధ్వర్యంలో 11 నెలలుగా గ్రామంలోని క్షత్రియ రామాలయంలో ప్రతీనెలా బహుళ దశమి నాడు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తున్నారు. శనివారంతో 11 నెలల పాటు ప్రతీనెల నిర్వహించిన పారాయణ ముగిసింది.

జగనన్న లేఅవుట్ పరిశీలన



జగన్నాథపురంలోని లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఏఈ ఫణీంద్ర

మొగల్తూరు: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఫణీంద్ర కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని జగన్నాథపురం జగనన్న కాలనీలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న లేఅవుట్‌లో అప్రోచ్ రోడ్లకు రూ.3.50 లక్షలు, రెండో సారి లెవిలింగ్‌కు రూ.2.50 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో లెవిలింగ్ పూర్తికావడంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు వచ్చి వేగవంతంగా నిర్మించుకోవాలన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ పరంగా అందించాల్సిన రుణాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన వెంట డిజిటల్ అసిస్టెంట్ రాధాకృష్ణ, సర్వేయర్ రవికుమార్ తదితరులున్నారు.

శేషుబాబుకు శుభాకాంక్షల వెల్లువ



శేషుబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న యలమంచిలి మండల నాయకులు

యలమంచిలి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన మేకా శేషుబాబును శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు నాయకత్వంలో మండల నాయకులు కలసి శుభాకాంక్షలు చెప్పారు. భగవంతునికి సేవ చేసే అవకాశం మొదటిసారిగా పాలకొల్లు నియోజకవర్గానికి రావడంపై వారంతా సంతోషం వ్యక్తం చేశారు. శేషుబాబును కలిసిన వారిలో సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహారావు, చిలుకూరి సుబ్బారావు నాయకులు బోనం బులివెంకన్న, ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, వీరా ఉమాశంకర్, వీరవల్లి నరసింహమూర్తి, జక్కంశెట్టి భాగ్యలక్ష్మి, నిమ్మకాయల రామకృష్ణ, జవదాల సువర్ణరాజు ఉన్నారు.

ఎస్వీకేపీ అభివృద్ధికి కృషి



ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల పూర్వ సిబ్బంది సమావేశం

పెనుగొండ: ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల అభివృద్ధికి మరింత కృషి చేయనున్నట్లు పాలక వర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ అన్నారు. కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా శనివారం ఆవరణలో నిర్వహించిన పూర్వ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. పూర్వ సిబ్బంది సూచనలు, సలహాలు స్వీకరించి కళాశాలను ముందంజలో ఉంచుతామన్నారు. 50 ఏళ్లలో సాధించిన అభివృద్ధి, విజయాలను ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, విశ్రాంత ప్రిన్సిపాల్స్ డాక్టర్ జీ తమ్మయ్య, కే చక్రవర్తి, పీవీఎస్ ఆదికేశవ స్వామి, ఎస్వీ రమణమూర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు,కేవీ రమణ మూర్తి పాల్గొన్నారు.

మనోవేదనతో వృద్ధురాలి మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని వడ్లవానిపాలెంలో స్థల వివాదంలో మనో వేదనకు గురై పిట్టల బసవరత్నం (73) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో మృతురాలికి చెందిన స్థల వివాదంలో మధ్యవర్తిగా వచ్చిన ఎ.శ్రీరంగం అనే వ్యక్తి వాగ్వివాదానికి దిగారు. దీంతో శనివారం మృతురాలికి చెందిన కొబ్బరితోటలో పడిపోయి ఉంది. సరిహద్దు రైతు మృతురాలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడుతో ప్రాథమిక వైద్యం చేయించారు. 108 సిబ్బందికి ఫోన్ చేయడంతో వైద్య సిబ్బంది వచ్చి వృద్ధురాలిని పరీక్షించారు. అప్పటికే వృద్ధురాలు మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలు కోడలు చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.